# శిల్పబాల ×

రచన :
టి. రామకృష్ణశర్మ

సన్నజాజుల సంపెంగి సువాసనలతో చిరుగాలులు వెదజల్లెడి సంధ్యాసమయం. విశాల విరూపాక్షుని కోవెలలో జేగంటలు గణగణ మ్రోగాయి. ప్రభువు దైవదర్శనం పూర్తిగావించి గృహోన్ముఖు లయ్యారు.... ఆశ్చర్యం అద్వితీయం. అనుపమానం. ఆనందం. ప్రభువుల దృక్కులు కఠిలశిలను మైనపు ముద్దగామార్చి చెక్కబడిన నూతనకళా ఖండికను ఆకర్షించాయి. ఇంకను శిల్పం పూర్తిగాలేదు. హస్తములు, వక్షములలోని మెరుపు మిగిలిపోయినాయి. 'ఆహా' ఆయన హృదయంలో ఏదో తళుక్కున మెరిసింది. ముఖం ఆనందంతో తొణికిసలాడింది. క్షణంసేపు తన్మయావస్థలో తనువునుమరచారు. ఆలయంలో మారుమ్రోగెడి ఘంటానినాదంతో తేరుకొని "ఈ శిల్పాన్ని యెవరు చెక్కారు?" జాలిగా ప్రశ్నించారు. "మేమీ శిల్పాన్ని చూచి ముగ్ధులమయ్యాము, ఆ శిల్పిని చూడాలని ముచ్చట పడుతున్నాము" మహారాజు నోటినుండి ముత్యాలురాలాయి.

ప్రతీచీ హృదయంలోకి భాస్కరుడువాలి వీక్షిస్తున్నాడు. పక్షుల కిలకిలారావములతో ప్రకృతి పరిపూర్ణమాతోంది. దూరముగా లేమామిడి చెట్టుక్రింద మ్రానునానుకుని పదునేండ్ల యువకుడొకడు చేతిలోని మంజులమురళితో ఏదో మధురగీతిక నాలాపిస్తున్నాడు. చుట్టు గుమికూడిన అలమందలు ఆనందంతో అలమటిస్తున్నాయి. లేవయస్సులోవున్న బుల్లితువ్వాయి చెంగుచెంగున గంతులిడుచు యువకునిచుట్టు పలుమార్లు ప్రదక్షిణకార్యమాచరించి మధ్యమధ్య అతని చెంపలను చేతులను మృదువుగా నాకుతోంది. పండు వెన్నెలలో పావనమురళిపాట పల్లవమైంది. కొంత సేపటికి సృతిని తగ్గించి తలనువంకించి ప్రక్కకు తిరిగాడు.– రాజభటులు ప్రభువుల సాన్నిధ్యానికి ఆహ్వానిస్తున్నారు.— కారణం అగోచరమైంది. కొద్ది క్షణాలలో అతనిని ప్రభువుల యెదుట నివేశపరిచారు. ఒక్కసారి ఆపాదమస్తకము పరికించిన ప్రభువులు ఆశ్చర్యచకితులయ్యారు. "ఎవరయ్యా నీవు?" యువకుడు యెందుచేతనో వణకసాగాడు.

"ఎవరు... ఈ శిల్పాన్ని చిత్రించింది?" ప్రభువు మాటలలోని మార్దవం, అంతరార్థం యువకుడు కనుగొనలేదు.

తడబడుతూ విలంభనతో "నే–నే ప్రభూ"

"నీ–వా?" ఆ చూపులలోని కరణ మాటలలోని మధురత యువకునికి అర్థం కాలేదు.

"చిత్తం... మహాప్రభూ" సవినయంగా సమాధాన మిచ్చాడు.

పదునేడువత్సరముల యువకుని ముఖంలో ప్రభువులకు ఏదో తేజస్సు గోచరించింది. కన్నులలోని కాంతిచూపుల మార్దవత, హస్తా

ల్లోని రమణీయత మిలమిలా మెరుస్తున్నాయి. వానిని వీక్షిస్తున్నప్పుడు ప్రభువులు యేదో స్వర్గానుభూతి పొందినట్లు మహదానందభరితులై "ఈ శిల్పంలోని మూర్తులెవరు నాయనా? హస్తశేషియైన యీ శిలలోనిమూర్తి దేదీప్యమానమై ఆనందంతో అలమటింపజేస్తోంది. హస్తములు విడిచినావే? శిల్పమునకవి ప్రసాదించకూడదూ?" పదలాలిత్యంతో ప్రశ్నలు గావించారు.

యువకుడు మాట్లాడలేదు. శిరస్సు వంచి కాలి బొటనవ్రేలితో నేలను రాస్తూ క్రిందచూస్తూ నిలుచున్నాడు.

"యేం నాయనా— అంతర్లీనమైన అభిభాషణ యేమైనావున్నదా?..."

"ప్రభూ..." తడబడుతూ సార్వభౌముని పరికించాడు. చూపులోని క్లేశము పరీవృతమౌతోంది. క్షణంసేపు మౌనం, ఆవేదన, అందులోనే అనురాగం.

"మన్నించండీ ప్రభూ" నేత్రద్వయం నుండి వెచ్చనీ బిందువులురాలి పుడమిలో యేకీభవించాయి.

గాద్గదికముగా గాథ స్పష్టపరిచాడు.

"నిశీథసమయం. ఆ ప్రశాంత వాతావరణంలో అలలై అధిగమిస్తూన్న అద్వితీయ అమరగానం. ఆ రాగాలాపన అష్టదిక్కులు లతలా అల్లుకుంది. మింటిని పరుగులిడే ధవళ మేఘమాల. పున్నమచంద్రుని లేతకిరణాల సోయగం. తారలతళుకులు. మందగమనంతో నిండుగాపారే సెలయేరు, యేటికిరుకెలంకుల మేఘచుంబనములైన వృక్షసంతలి, లేరెమ్మల రెపరెపలు, కోయిల కువకువలు, నిశీదశబ్దాన్ని ఛేదించెడి ఆరావళి, పాల వెన్నెలలో చందురుని చల్లని కిరణాలతో దాగుడుమూతలాడే వృక్షఛాయలు. వీటినన్నిటిని మించిన మధుర గానము. ఆలమందలు గృహోన్ముఖులై విశేష కాలమతిక్రమించింది. ఆ వెన్నెల మెరుపులోనే వినూత్నకాంతి ఆవిర్భవించింది. అంగన స్వరం అపరూపంగా మెరిసింది. యెట్టెదుట అల్లంతదూరంలో మూర్తి సాక్షాత్కరించింది. సోయగంతో మధురంగా సైగచేసింది. పిల్ల వాయువులలో వలువల రెపరెపలు, పుచ్చపువ్వు వెన్నెలలో పుష్పావృతమైన కేశ సంపద, వినూత్నబాహులత, కమలనయనాలు.– ఏదో అస్పష్టంగా ప్రబోధం, మనస్సు వణికింది. క్షణంలో వికసించింది. నేత్రద్వయం నవనీతంగా మెరిసింది. శరత్ చంద్రికా రేయి తృటిలో అతిక్రమించింది. కాలానుగుణ్యంగా ఉదయసంధ్యలు ఆవిర్భవించాయి. నిష్క్రమించాయి. దేవి సాక్షాత్కరిస్తూనే వుంది. పూర్ణహృదయంతో ప్రబోధిస్తోంది. ఆలాపిస్తోంది. అనురాగంతో అలమటిస్తోంది. ఆరాధ్యదేవతగా విలసిల్లుతోంది. కవితావిలాసినిగా కరుణప్రయుక్తయై కనుచూపులో నాట్యరవళిగా నిశ్చయమైంది. గాన సుధామృతము పంపాతరంగాలలో పయోధి నధిగమిస్తుంది. ఆనందదాయకి, కళావిలాసిని. ఆయుష్మతి, అమరజ్యోతి...ప్రభూ చెమర్చిన నేత్రాలతో గాథగనిన ప్రభువులు విస్మయమొంది శిల్పివర్చస్సు పరికింప నిశ్చయించారు. శెలవుగొనిన శిల్పి తరలిపోయాడు. చెట్లులు పుట్టలు, ఆలమందలతో అనురాగాలు, ప్రకృతి కౌగిట్లో కవిచాగీతాలు, పావనపంపాతీరంలో జలకమాడే శిల్పబాల ప్రకృతిశోభలో పరమ పావనిగా నిలచిపోయింది.